పర్యాయపదాలు :

# యల్. యల్.

డి. భాస్కర్

★

"ఓ శుకమహర్షి! నిన్ను వలచిన వనితను చేపట్టి, మీ వలపు పంటలను పండించుకొని, ఆదర్శప్రాయమైన సంతానముబడసి, ఆ పసిపాపల ప్రతినవ్వులోను లీనమై, ఆ సంతాన కలిమి బలిమితో హిందూగృహస్థాశ్రమధర్మాన్ని జయించి, భక్తి, రక్తి, ముక్తిప్రధానమైన మోక్షమార్గము నన్వేషించి......"

"పొరపడి అడిగానురా బాబూ నిన్ను! ఆగు, ధోరణికి కట్టు, ఆనకట్టు! నన్నెందుకు చంపుతావుగానీ, శుభ్రంగా కవితావనితను వరించరాదూ?"

"అదీ, యిదీ చెప్పి త్రోవ తప్పించడానికే కదూ నీ యెత్తు, సంతోషించాం కాని, నీ మతం తెలుసు, మరి నా హితవు విను: నువ్వింతకాలం యీ బ్రహ్మచర్యంలో వుండి, అవ్యక్తమైన బాధను అనుభవిస్తావో. అంతకాలమూ-నువ్వు, నెలకు ఇరవైతొమ్మిదిన్నరరోజులు నీకే మంచమే గతి! నీకీ ఆవేదనాపూరిత వ్యాధియే శరణ్యం. నన్ను ఒక ఆత్మమిత్రునిగా నమ్మేవ్, యింతవరకూ, నేనే విషయం చెప్పినా నీ బాగు కోసమే......పెళ్ళివల్ల నష్టమేమిటి చెప్పూ?"

"చెప్పమంటావా? నాకంతా నష్టమే!... అంతే!"

"హరి పిడుగా, అంతా అంటే యెంత? ఇంతా? కొంతా?......చెప్పు!"

"అబ్బ యేమిటిరా, సంత, వివాహం చేసికొంటే నా స్వేచ్ఛ నశిస్తుంది, కాలం వ్యర్థమైపోతుంది. చదువు చెక్కిపోతుంది......ఇంకా వెనకనుంచి ఒకడూ, ముందునుంచి ఒకతె తయారు...డబ్బంటూ! ఇంకేం గావాలి? ఇదంతా అనర్థం కాదూ?"

"అయితే అంతా యిలాగే అనుకుంటే మనం యీపాటికి యెక్కడ వుండువారో?..."

"అందరి మాటా యెందుకూ? నా మాట నాదే!"

"ముళ్ళత్రోవలో పడ్డాడు అబ్బాయి. అయితే, అనవసరంగా మన స్కూలు విద్యార్థుల వ్రాతల వల్ల గోడయెక్కడం నీకు సమ్మతమా? పవిత్రురాలయిన మన...లేడీ టీచరుగారి పవిత్ర హృదయంలో రేగే విషాదపూరిత తుఫానుకు కారకుడవు నీవు గాదా? నీ ఆలింగనాన్ని అపేక్షించిన ఆ ఉవిద జీవనం, ఉజ్జ్వలమైనదని తెలుసుకోలేకపోయావా? ఆసేచనకమైన ఆమె సౌందర్యాన్ని ఆస్వాదించడం నీకు చేతకాదన్న మాటేనా, ఆమెను విరహాగ్నిలో పడత్రోయడం నీకు న్యాయమేనా? పరులు నీమీద వేసే నిందలకు బుద్ధిచెప్పలేవూ?"

"పరనిందలతో నాకేంపని; నా ఆత్మబలమే నాకు చాలు."

"నీకు ఆత్మబలం వుంది! కాని అది నీకు వుపయోగించడం చేతకావడం లేదు. పైగా నీవు యిప్పుడు లోకంలో వున్నావ్ కాని, అడవిలో కాదుగదా! మొండిపట్టు పట్టుకు కూర్చుంటే లోకం హర్షిస్తుందా?"

"భాస్కర్! నువ్వు స్త్రీపక్షపాతివిరా!"

"అవునురా, వేణూ! నేను స్త్రీ పక్షపాతినే, కాని నా పక్షపాతాన్ని నువ్వు న్యాయంగా పసికట్టాలి. పత్నిసృష్టిలో యీశ్వర ప్రకాశం వుందిరా. పతి తన చింతలనూ, వంతలనూ మఱచి-తన పిపాసను వారించుకొన గలుగుతాడు, ఆ పత్ని సృష్టియందున్న మధురరసవాహినిలో! అద్భుత జ్యోతీ, అమందానందం, అమరప్రేమ-సర్వమూ వున్నాయ్, స్త్రీ మానసంలో. అట్టి సతి లభించడం పరమాత్మ కృపావిశేషం! ప్రతివాడూ ఒకే ఒక స్త్రీని నమ్మినవాడు, అతనికి స్వర్గద్వారం ఆహ్వానపూర్వకంగా వేచియుంటుంది. అతని జీవితమూ, జన్మమూ సఫల మౌతాయ్! ఇపుడు తెలిసిందా నా పక్షపాతం! ఉదారశయ, ప్రేమవాహిని, పుణ్యమూర్తి, పవిత్రమూర్తి అయిన కోమలికి కైమోడ్పు కావిస్తాను నేను. అంతేకాని;...నా మాట విను—గాంధిగారు చెప్పిన మాటలలో నీకు నమ్మకం వుంటే—నిన్ను మనసారా ప్రేమిస్తున్న...లేడీటీచరును ఆనందపరచడానికి నీ ప్రాణాలనయినా అర్పించి ఆమె

గౌరవాన్ని కాపాడే భారం నీది. దీనిని యెవరయినా యెదిరిస్తే, దాచే భారం నాది."

"అకరే, నా దగ్గర యేమీ లేదే బహూకరించడానికి—నీ కవిత్వానికీ, నీకూ ఒక నమస్కారం. పైమింతయిందో చూసావా? వెళ్ళు నీకు కూడా ఆ పెండెన్సు దండుగెందుకూ? నాకు మాత్రం ఒక యల్. యల్. వ్రాసిపారేయి లేడీ టీచరుగార్కి—"

"ఏమయినాసరే, నా చదువూ, నీ చదువూ చట్టుబండలయిపోయినాసరే; నువ్వు నాకు మాట యిస్తేనే, యిక్కడినుంచి నే కదిలేది. ప్రొద్దుటినుంచీ నేడు కూడు ముట్టలేదుగదా హోటల్లో! నువ్వు నాకు మాటయిచ్చేవరకూ నేను సత్యాగ్రహం సాగిస్తా. చూసుకో!"

"బాకీ వసూలుకి వచ్చిన కాబూలీవాడి తంతులా వుంది నీ వ్యాపారం. అలాగే, ఆలోచించి చూదాంలే. ముందు స్కూలుకు వెళ్ళు."

"ఆలోచిద్దాం...చూదాం...చేదాం...అంటే నీతో కొన్ని తరాలయినా పడుతుంది. మా వదినా...నువ్వూ...ఒక గదిలోకి వెళ్ళేవరకూ నాకు శాంతి లేదు."

"దగసకూడా పేర్చావ్‌రా అప్పుడే, ఒరేయి, భాస్కర్, నీ ఉసురు నా కెందుక్కానీ, పోయి మెతుకులు కరు—"

"నన్ను ఖూనీ చేసేస్తున్నావురా? అటో, యిటో సాయంత్రం చెప్పేస్తా!"

"అమ్మయ్య! బ్రతికించావ్‌రా, ఆ మాత్రం యిదివరకే చెపితే,...ఇక అటూ లేదు...యిటూ లేదు. నాకు తెలిసిందిలే. పోయి మూడు రేషను భోజనాలు చేసేస్తాను!"

"పోతున్నావు కానీ...నాకు లీవ్ లెటరు వ్రాస్తావా? మరచిపోతావా?"

"స్వర్గానికి వెళ్ళినా విడాకులు తప్పవన్న మాట! మరి, మన లేడీటీచరు...స్సారీ...మా వదినగారు అలా ఒప్పుకోరుగా, నువ్వే వ్రాసి యిచ్చెయ్యి సంతోషంగా పట్టుకు వెళ్తాను."

"అబ్బ, నాకు ఓపిక లేదురా వ్రాయడానికి, నువ్వే వ్రాసెయ్యి."

"పోనీ; కాగితం యిదిగో...దిగువను సంతకం పెట్టు... ఇక నీకీ శెలవుచీటీలు యెంతకాలంలే."

## లేఖలు వ్రాయండి

ఈనాడు ప్రజలకు బాధాకరములయినవీ, అత్యంత ప్రముఖమైనవీ జీవిత సమస్యలు ఎన్నో అనుక్షణమూ ఉత్పత్తిల్లుతున్నవి. వీటన్నిటినీ ప్రభుత్వపు దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు అన్వేషించాల్సిఉన్నది. అతి సంగ్రహంగా మీరు వ్రాసి పంపే సమస్యల్ని సంతోషపూర్వకంగా మేము ప్రకటిస్తాము. ఈ రూపకమైన మా సేవను 'ఆనందవాణి' పాఠకులు, అభిమానులు ఇంతటినుంచి వినియోగించుకోగలరని ఆశిస్తున్నాము.

-సంపాదకుడు

"చల్లగా, మెల్లగా ఒక్కొక్క ముక్కే వదిలేసున్నావు..." అంటూ మా వేణు సంతకం పెట్టేశాడు కాగితంమీద, ఇక నా 'ప్లాను' జరగాలి.

★

సాయంత్రం అయింది. పాచిక ఫలించడానికి యిక కొద్ది నిమిషాలే గడువు. మా వేణు గృహాభిముఖంగా నడిచినయ్, నా కాళ్లు వుత్సాహంతో. మా వాడు 'ఒక యింటివాడు' అయిపోతున్నాడిక. మిత్రగృహంలో అడుగు పెట్టేసరికి, మిత్రుడికీ...కాబోయే తన కళత్రానికీ సంభాషణ యిలా వినపడుతూంది:

"మిస్టర్, వేణూ. మీ వుత్తరం నా కెంతో సంతోషాన్నిచ్చింది. నా మీద యిన్నాళ్ళకు మీకు దయ కలిగింది. ఈ కార్యానికంతకూ కారకులు మీ మిత్రులే. ఆయన్నెలా అభినందించాలో నాకు తెలియడంలేదు."

"అ...ఉ త్తరం...నేను ...వ్రాశాను......ఉ..." అని కంగారులో పడ్డాడు వేణు.

"అవునండీ...మీరు వ్రాసింది...మీ సంతకం వుందిగా!" అంటూ లేడీటీచరు తన 'హేండ్ బేగ్'నుండి నేను వ్రాసిన యల్.యల్. తీసి యిచ్చింది.—

ప్రియా!

క్షమించు, నిన్ను దుఃఖసాగరంలో ముంచిన యీ దీనుడు నిజంగా దురదృష్టవంతుడు. నిన్ను అర్థంచేసికోలేక- నీ పవిత్ర హృదయంనుండి కదిలే ఉదారాశయాలను గ్రహించలేక- నీ సౌందర్యానికి ఒక దివ్యరూపాన్ని కల్పించుకోలేక- మృదు మధుర కోమల శ్యామలమగు నీ మనస్సును, యేమో అనుకుని తూలనాడేను. అంతే కాదు. యీ రెండు వత్సరాలూ నీకు వంత కలుగజేసి, నేను చింతలో పడ్డాను. ఇకనుండి నీవే నేను— నేనే నీవు. లోకం వేసే పాడు నిందలకు బుద్ధి చెప్పుదాం. మన జీవిత భాగ్యోదయం యెప్పుడూ?

ఇట్లు,
నీ ప్రేమపాత్రుడు.
.........వేణు.

చదివి కొయ్యబారిపోయాడు, మావాడు. లోనికి ప్రవేశించాను—

"ఓహో! ప్రేమికా ప్రేమికులారా! మీకు జయమగుగాక" అంటూ.

"సూత్రధారులా...యిలా కూర్చోండి" అని లేడీటీచరు ఆహ్వానించింది.

"సంతోషం...యీ 'మేరేజ్', యీ 'వెడ్డింగ్', యీ వివాహము, యీ పాణిగ్రహణము, యీ పరమపవిత్ర ప్రణయ కలాపము.....యీ జీవిత భాగ్యోదయ శుభసమయము..." అడ్డువచ్చాడు మావాడు.

"యెంత పని చేశావురా, అవును గాని యీ పర్యాయపదాలు నాకు తెలియకుండా యెప్పుడు నేర్చుకున్నావ్ రా?" అన్నాడు నీరసంగా నవ్వుతూ.

"అవును నా నిఘంటువులో యల్. యల్. 'అంటే' లవ్ లెటరు—"


రీటా

తలవెండ్రుకలను పెంచును



రీటా కుదుళ్ళకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెండ్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్. తలవెండ్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు, ఇంకను తలవెండ్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండి రీటాయే వాడుడు.

రీటా హిందూదేశమంతటా దొరకును.

వెల సీసా 15 అణాలు



RITA
HAIR TONIC